విద్యార్థులకు గమనిక! మన హైస్కూలుకు కావలసియున్న అన్ని తరగతుల పాఠ్యపుస్తకములు వచ్చి ఉన్నవి. అవసరమైనవారు మధ్యాహ్నం మూడో బెల్లు తరువాత ఆఫీసులో పైకము చెల్లించి తీసుకొనవలయును. లేపాక్షి నోటు బుక్కులు వచ్చుటకు యింకా టైము కలదు. అవి సెట్టుగా కావలసినవారు ముందే నలభై ఎనిమిది రూపాయలు చెల్లించవలయును. ఆ తర్వాత అడిగినచో ఇవ్వడం సాధ్యపడదు.

ఇట్లు

ప్రధానోపాధ్యాయుడు, విశ్వోదయ

ఈ నోటీసు మా ఇస్కూల్లో, ఆఫీసు రూము పక్కన, పసుపుపచ్చటి గోడ మీద నల్లటి బ్లాక్‌బోర్డు పైన రాసి ఉంది.

టెక్స్టు బుక్కుల మాట ఇది మనకు సంబంధం లేనిది. టెక్స్టు బుక్కుల మాట మనకు సంబంధలేనిది అని ఎందుకు అంటా ఉన్నానంటే నాకు జన్మనిచ్చిన మా అమ్మగానీ, మా నాయనగానీ, నాకు ఆరోకిలాసులో, లేకపోతే ఏడో కిలాసులో, ఏనాడూ కొత్త టెక్స్టుబుక్కుల సెట్టుని కొనిచ్చిన పాపాన పోలా. సెకండ్ హ్యాండు బుక్కులే. ఇప్పుడు కూడా ఎనిమిదో కిలాసులో కొత్త టెక్స్టుబుక్కులు కొనిస్తారన్న గ్యారంటీ లేదు గాబట్టి వాళ్లు ఒకరిని వెతికి ఆ పుస్తకాలు కొనిచ్చే బదులు, నాకు పనికొచ్చే పుస్తకాలు ఎవడికాడున్నాయో నేను ఎతుక్కుంటే పోదా అని అనుకున్నాను.

అట్టా ఎతకతా పోతా ఉంటే, ఆ పనిలో నాకు మా యింటికాడుండే శెట్టిగార్ల పిల్లోడు గాదంశెట్టి రమేషు అవుపించినాడు. వాడు ఇప్పుడు నైన్తు కిలాసు, మొన్నే ఎయితు ప్యాసైనాడు. నాకు కావలసిన ఎయిత్ కిలాసు టెక్స్ట్ బుక్కులు యిప్పుడు వాడికాణ్ణే ఉన్నాయి. కొంటే వాటినే కొనాలి అనుకున్నాను నేను.

ఎందుకురా అంటే సెకండ్ హ్యాండ్ పుస్తకాల కత అట్టాంటిది. వాటిలో మూడు రకాలు ఉంటాయి.

మొదటి రకం – ఆ సంవచ్చరమే కొత్త టెక్స్టు బుక్కుల సెట్టుకొని, వాటిని నలపకుండా జాగ్రత్తగా బ్రౌనట్ట ఏసుకొని, గుడ్డల అంగళ్ల కాడికిపోయి, ఆడ దొరికే చీరల మీది ప్లాస్టికు కవర్లతో, ఆ బ్రౌనట్టల మీద యింకో అట్ట వేసుకొని, పిన్నులు కొట్టుకొని, లోపల పేనాల గీతలు, పెన్సిళ్ల గీతలు పడకుండా కాపాడుకొని, ఆ మరుసటి సంవచ్చరం వాటిని బద్రంగా అమ్ముకుంటే అయి ముక్కాలు రేటు.

అంటే ఎనిమిది రూపాయల లెక్కల పుస్తకం ఆరు రూపాయలన్నమాట.

అట్టగాకుండా కొన్నది కొత్త టెక్స్టుముక్కుల సెట్టే అయినా, వాటిని సరింగా చూసుకోక, అట్టలు గిట్టలు

వేసుకోకుండా, వాళ్లకీ, యీళ్లకీ యిచ్చి, లోపల పాడు చేసి, గలీజుగా తయారు చేస్తే, వాటికి సెకండ్ హ్యాండ్ రేటు. అంటే ఎనిమిది రూపాయల పుస్తకం నాలుగు రూపాయలన్నమాట.

ఇంకో మూడోరకం ఏమిటంటే, అసలు కొనడమే సెకండ్ హ్యాండు పుస్తకాలు కొని, వాటిని ఇంకా నాశినం బట్టించి, తాకితే చాలు చిరిగిపోయేటట్లుగా తయారు చేసిపెడితే, వాటిదింక బజ్జి బజ్జి కేటగిరి. అంటే పావురేటన్నమాట. ఎనిమిది రూపాయల పుస్తకం రెండు రూపాయలే.

అయితే మనకు ఈ బజ్జి బజ్జి పుస్తకాలు ఏల? అట్టలు నలిగిపోయిన ఆపురేటు పుస్తకాలు కూడా ఏం? మన దగ్గిర ఉండే గింటే ముక్కాలు రేటు పుస్తకాలే ఉండాల. అయికూడా ఆపురేటుకే రావాల.

ఈ డిమాండింగులన్నింటికీ సరిగ్గా సరిపోయేది గాదంశెట్టి రమేషు కాడున్న పుస్తకాలే కాబట్టి వాడి కాడికి పోయి అడిగినాను.

వాడు నా మొకం తట్టయినా చూడకుండా “ఆ…కుదరదమ్మా, మేము ఎంత నీటుగా పెట్టుకున్నాం మా టెక్ష్టు బుక్కులని, కావాలంటే ముక్కాలు రేటుకి కొనుక్కోగానీ ఆపురేటుకి ఇయ్యను. ఇప్పుడు ఆ డబ్బులకి ఇంక రొన్ని కలుపుకొని నేనుతొమ్మిదో తరగతి పుస్తకాలు కొనుక్కోబళ్లా?” అన్నాడు.

ఈ మాటలకి ఏమిచెప్పాలో తెలియక వాడి తట్టే చూసినాను తల గీరుకుంటా.

వాడు చూడ్డానికి సన్నగా బక్కగా ఒంటూపిరితో ఉంటాడు గానీ, పొద్దుగూకులా జేబులో శనగపప్పు ఏసుకొని రోజుకి ఒక కేజీ అన్నా ఊది పారేస్తా ఉంటాడు. నవ్వితే నల్లగి చిగుళ్ల మీద తెల్లటి శనగపప్పు తునకలు అవుపిస్తా ఉంటాయి.

ఆ తునకలని చూసి, అయిడియా తెచ్చుకొని “ఒరే రమేషా, యియ్యాల మా నాయన నెల్లూరికి పప్పులమిల్లులో మోటారు రిపేరీ పనికి పోయిన్నాడురా. వచ్చేటప్పుడు ఎట్టలేదన్నా అర బస్తా శనగపప్పు తెస్తానన్నాడు, ఆ శనగపప్పులో రొంత నీకు పెడతానురా, నాకు ఆపురేటుకి యియ్యరా” అన్నాను గోడ కట్టినంత దిట్టంగా అబద్ధం ఆడతా.

“అబ్బా మా యింట్లో కూడా ఉందిలేయ్యా శనగపప్పు బెల్లం కలుపుకొని తినేదానికి మాకేం బళ్లేదులేబో” అని తేల్చేశాడు వాడు.

ఇంకెట్టరా అని ఆలోచన చేస్తా ఉంటే “పోనీలేరా, ఆపురేటుకి యిచ్చెయ్‌రా” అనింది రమేషు వాళ్ళ అమ్మ ఆడికొచ్చి.

రమేషు వాళ్ల అమ్మ చాలా మంచిది. మనిషి కూడా బలే మెతక. అదీగాక ఆమెకి కతలంటే అమితమైన ఇష్టం. నెలనెలా చందమామ, బాలమిత్ర తెప్పిచ్చేది. నేను వాళ్లింటికి పోయినప్పుడల్లా, ఆ కతల పుస్తకాలని ఆబగా చదవతా ఉంటాను గాబట్టి అది చూసి ఆమెకు ముచ్చట.

“రమేషా…చూడా…వాడేదో అడిగినాడు…ఈరాదా?…పెతిదానికీ డబ్బులకాడ చూసుకోకూడదు నాయనా” అని ఆమె వెళ్లిపోయింది.

ఆ మాటను నేను అందుకొని “ఒరే, మీ అమ్మ గూడా చెప్పింది గదరా. అమ్మ మాట కాదనకూడదురా. అమ్మ మాట వింటే పుణ్యంరా. అదే మా అమ్మ గనక నాతో ఇట్టాగే అని ఆపురేటుకి కాదురా ఊరకనే యిచ్చెయ్‌రా అనంటే నేను ఎవరికైనా సరే టకామని యిచ్చేస్తానురా” అన్నాను వాడి గెడ్డం పట్టుకుంటా.

(మా అమ్మ ప్రాణం పోయినా అట్టా అనదు. అన్నా, నేను ప్రాణం పోయినా యివ్వను. ఏడో కిలాసులో మిగిలిన నా బజ్జిబజ్జి టెక్స్టుబుక్కులని ఏ నరుడూ కొనకుండా పోతే, పాతశెట్టికి తూకానికి వేశానేగాని ఎవరికైనా ఊరికనే యిచ్చానా?)

వాడు మొకం ఒకలాగా పెట్టి “సరే అయితే, ఈ సంవత్సరం ఇస్తా. వచ్చే సంవచ్చరం మళ్లా నాకాడికి తొమ్మిదో తరగతి పుస్తకాలకి వస్తావుగదా, అప్పుడు మాత్రం ఆపురేటుకి ఇచ్చేది లేదు” అన్నాడు వాడు.

“సరేరా, బలేవాడివిరా, అప్పుడు దేవుడు దయతలిస్తే, ఫుల్‌రేటు ఇచ్చి కొనుక్కొంటానురా” అని ముక్కాలు రేటు చేసే వాడి టెక్స్టుబుక్కులను ఆపురేటుకి నైసుగా నూకేశాను.

అట్టా ఎనిమిదో కిలాసు వరకూ నా టెక్స్టు బుక్కుల బాద తీరింది గానీ, యింక నోటు పుస్తకాల దిగులే తీరలా. నోటీసు బోర్డులో లేపాక్షి నోటు పుస్తకాలు నోరూరిస్తా ఉన్నాయి గానీ మనకంత ప్రాప్తం ఉందా? మా నాయన ఆ మాత్రం మనిషా?

ఎట్టరా అని ఆలోచన చేస్తా ఉంటే, తురాయి చెట్టు కింద నిలబడి వేళ్ళు లెక్కబెట్టుకుంటున్న కందుల మాలకొండరావుగాడు కనిపించాడు.

“ఏందిరా మాలకొండయ్య, ఏందిరా లెక్కబెట్టుకుంటా ఉండావా?” అని అడిగాను వాడికాడికి పోయి.

“ఏమి లేదురా, టెక్ట్సుబుక్కులు కొనేదానికి డబ్బులు ఉన్నాయి. లేపాక్షి నోటుబుక్కులకు కట్టేదానికి డబ్బులు ఉన్నాయి. అయితే ఆ నోట్సులు వచ్చేటప్పటికి టైంపట్టద్ది అంటా ఉన్నాడు గదా హెడ్మాస్టరు. అప్పటిదాకా రఫ్‌రి సబ్జెక్టుకి ఒకటి లెక్కన ఆరు నోటు బుక్కులన్నా కొందామా అని ఆలోచిస్తున్నానురా” అన్నాడు వాడు.

ఆ మాటలకి నా కడుపు కాలిపోయింది.

కందుల మాటకొండరావు వాళ్ల నాయన కందుల నరసింహం బేల్దారు మేస్త్రీ. అంటే ఇళ్లు కడతారు చూడు ఆ పని. ఆయన కింద పది మంది బేల్దార్లు, పదిమంది కూలోళ్లు ఉంటారు. వాళ్లంతా పొద్దుటి నుంచి పొద్దుగూకే దాకా పని చేసి కూలిడబ్బులు తీసుకొని పొట్టిశ్రీరాములు సెంటరుకాడున్న అడ్డాకి వస్తారు. ఆడ చెట్టు కింద మాలకొండరావు వాళ్ల నాయన నిలుచొని ఉంటే ఒక్కొక్కరుగా వచ్చి కమీషను యిచ్చేసి పోతారు. బేల్దారుకి వచ్చే యిరవై నాలుగు రూపాయల్లో నాలుగు, కూలోనికి వచ్చే పన్నెండు రూపాయల్లో రెండు లెక్కన. అందుకని వాళ్ల నాయన కాడ ఎప్పుడూ డబ్బులుంటాయి.

మా నాయనకాడా?

ఒక రోజు వస్తాయి. ఒక రోజు రావు. పైపెచ్చు మా నాయన ఆయన కొందున్నోళ్లకు డబ్బులియ్యాలి గానీ వాళ్లు ఈయనకియ్యరు.

అందుకని మనం నోటు బుక్కులకు డబ్బులు అడిగితే మా నాయన “చూద్దాం చూద్దాం” అంటాడు. మాలకొండరావు వాళ్ల నాయన “తీసుకో తీసుకో” అంటాడు.

సరే వాడి ప్రాప్తం మన ప్రాప్తం కాదా. వాడికి వస్తే మనకు వచ్చినట్టే గదా అనుకొని ఒక ప్లాను వేసి “మాలకొండయ్యా, నీకు తెలియదురా నోటుబుక్కుల సంగతి. అయి శ్రీనివాసాలో ఒకలాగా ఉంటాయి. చెల్లపిళ్లలో ఒకలాగా ఉంటాయి. కొన్ని ఇంకు పేనాతో రాస్తే ఊరతాయి. కొన్ని ఈ పక్క రాస్తే ఆ పక్క అవుపిస్తాయి. నన్ను తోడు తీసకపో, నేను మంచివి ఎతికి పెడతా” అన్నాను వాడితో.

“అబ్బా బతికించినావురా,” అన్నాడు వాడు.

ఆ సాయంత్రం ఇద్దరం పొట్టి శ్రీరాములు సెంటరు కాడికిపోయి వాళ్ల నాయన కాడ డబ్బులు తీసుకొని,

చెల్లపిల్ల బుక్ సెంటర్‌లో ఆరు నోటుబుక్కులు తీసుకున్నాం. వాటి అట్టలు చూస్తా ఉంటే ఆ కొత్త కాగితాల వాసన చూస్తా ఉంటే అదో ఆనందం. కానీ, ఆ ఆనందం నాది కాదే అన్న బాధ...

ఇంటికి పోయేటప్పుడు అడిగాను. "మాలకొండయ్యా, ఏడో కిలాసులో నువ్వు చాలా నోటుబుక్కులు కొన్నావుగదరా. ఇస్కూలుకు ఒకటి పర్‌వేట్‌కి ఒకటి పెట్టుంటావు గదా. ఇవిగాక 'మాబడి' లోని ఇంపార్టెంట్ కొసెన్ల కోసం కూడా నోటుబుక్కులు పెట్టినట్టుగా గుర్తు. అయన్నీ ఏమయ్యాయిరా?" అన్నాను.

"ఉన్నాయిరా, రేపో ఎల్లుండో తూకానికి వేయాలిరా అన్నాడు వాడు."

"అట్ట వద్దురా, ఆయన్నీ నాకు యిచ్చెసెయ్యి, నీ చేతిరాత బాగుంటుంది. ఎవురైనా కొత్తగా ఏడోకిలాసుకి వచ్చే పిలకాయలకి ఇస్తే ఉపయోగపడతాయి. పుణ్యం" అన్నాను.

"అబ్బా బలే ఐడియారా. తీసుకెళ్లరా, తీసుకెళ్లి ఇయ్యరా అన్నాడువాడు ఇంటికి తీసుకెళ్లి ఆ నోటుబుక్కులన్నీ ఎతికి నా చేతిలో పెడతా."

మొత్తం పన్నెండు దాకా ఉన్నాయి.

నేను వాటన్నింటికి ఇంటికి తీసుకొని వచ్చి, జాగ్రత్తగా కింద బెట్టి, ఎదురుగా బాసిమెట్టు వేసుకొని కూర్చుని, ప్రతి నోటుబుక్కులో పావువంతుకు పైగా మిగిలిపోయిన ఖాళీ కాగితాలన్నింటినీ నీటుగా చింపి, రెండు భాగాలుగా చేసి, పైన చార్టు వేసి, వైనంగా రెండు నోటుబుక్కులు కుట్టుకున్నాను.

కుట్టుకున్నాక, వాటిని ముక్కు దగ్గిరకు తీసుకొని వచ్చి వాసన చూస్తే కమ్మటి పాత కాగితాల వాసన.

"లేపాక్షి నోటుబుక్కులు పోతేపోయాయి ఏట్లో. మనకియ్యి చాలవా?" అనుకొని హుషారుగా మా యింటి బయటికొచ్చి నిలబడితే గాదంశెట్టి రమేషుగాడు తొమ్మిదో కిలాసు కొత్త టెక్స్టుబుక్కుల సెట్టుని ఇంటికి కొనుక్కొని పోతా కనిపించాడు.

నేను వాడికాడికి పోయి, వాడి జేబులోని రొంత సెనగపప్పు యిప్పించుకొని, ఆ కొత్త పుస్తకాల సెట్టుని నిండుగా చూసుకొని, వచ్చే సంవచ్చరం నా కాడికి వచ్చేదాకా యివి పరాయి గూటిలో ఉన్న బిడ్డలే గదా అనుకొని, ఎందుకైనా మంచిదని యింటిదాకా దిగబెట్టి వచ్చాను వాటినీ, ఆ గాదంశెట్టి రమేషుగాణ్ణీ.